క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: విద్యార్థులకు విద్యతోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై స్కూల్ స్థాయి నుంచే తరగతి గదుల్లో బోధించాలని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ శిక్షణలో వారు మాట్లాడారు. శిక్షణలో మెలకువలు తెలుసుకుని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సభ్యులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హనుమంతురావు, సీఎంఓ శివశంకర్, ఎంఈఓలు వినోద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

ఆత్మకూరురూరల్: మండలం శ్రీపతిరావుపేట గ్రామ శివార్లలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి వామి దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన ఏసన్న అనే రైతుకు చెందిన ఆరు ట్రాక్టర్ల పశుగ్రాసం ఈ ప్రమాదంలో కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని రైతులు ఆరోపించారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50 వేలు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. నిరుపేద రైతు ఏసన్న ను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీశైలానికి నేడు తెలంగాణ గవర్నర్ సతీమణి రాక

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సతీమణి సుధాదేవ్‌వర్మ ఆదివారం శ్రీశైలం రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రి శ్రీశైలం చేరుకుంటారని, ఇక్కడే బస చేసి సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగన్‌మోహన్

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని కాకనూరు గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు ఎస్ఐ జగన్‌మోహన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో జరిగే సైబర్ నేరాల గురించి, రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలను వివరించారు. 100, 112, 1930 నంబర్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. గ్రామ స్థాయిలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు.

మహానందిలో వీకెండ్ సందడి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

తర్తూరులో అండర్‌పాస్ సర్వీస్ రోడ్డు నిర్మించాలి

కర్నూలు (అర్బన్) : నందికొట్కూరు నియోజకవర్గంలోని తర్తూరు జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు అండర్‌పాస్ సర్వీస్ రోడ్డు నిర్మించాలని జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. తర్తూరు జాతర నెల రోజుల పాటు జరుగుతుందని, అనేకమంది భక్తులు వేలాది వాహనాల్లో తరలివస్తుంటారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారుమంచాల క్రాస్ వద్ద రైతులకు ఉపయోగంగా అండర్‌పాస్ సర్వీస్ రోడ్డు, తాటిపాడు గ్రామం వద్ద సర్వీస్ రోడ్డును నిర్మించాలని కోరారు. నేషనల్ హైవేస్ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభం కాని గార్గేయపురం–మిడుతూరు, నందికొట్కూరు–పగిడ్యాల నూతన రహదారుల నిర్మాణ పనులను పది రోజుల్లో మొదలు పెడతామని ఆర్అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

గోసంరక్షణనిధికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణనిధి పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపిక అందించి సత్కరించారు.

రైతులపై కపట ప్రేమ!

- మోటార్ల మరమ్మతులకు పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- సమస్యను రెండు మార్లు కలెక్టర్, ఎమ్మెల్యేలకు విన్నవించిన రైతులు
- అయినా స్పందించని ప్రభుత్వం
- చందాలు వేసుకొని మోటార్లకు మరమ్మతులు చేయించుక్ను రైతులు



జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం 1, 2 పంప్‌హౌస్



మరమ్మతులకు గురైన మోటార్లు

జూపాడుబంగ్లా: ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంపుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగుచేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతుండటంతో చూసి తట్టుకోలేని రైతులు అప్పులు చేసి, చందాలు వేసుకొని మోటార్లకు, పంపులకు మరమ్మతులు చేసుకొని పొలాలకు నీళ్లు పారించుకుంటున్నారు. కేవలం మాటలు చెబుతూ ప్రభుత్వం రైతులపై కపటప్రేమ చూపుతోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

జూపాడుబంగ్లా–1 ఎత్తిపోతల పథకం కింద మూడు మోటార్లు ద్వారా 73క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తారు. రెండు పథకాల కింద 9,289 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం 1, 2, లింగాల, నాగటూరు 1, 2, సంగమేశ్వరం, శివపురం ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంపులు, ప్యానల్ బోర్డులు మరమ్మతులకు గురయ్యాయి. వాటి మరమ్మతులకు రూ.70లక్షల నిధులు అవసరమవుతాయని టెక్నికల్ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు కలెక్టర్, ఎమ్మెల్యేకు విన్నవించగా వారు.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వం పైసా నిధులు కూడా విడుదల చేయలేదు. నీరు అందక ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోవటాన్ని చూసి తట్టుకోలేక సాగునీటి సంఘాల కమిటీ సభ్యులు ఒక్కో ఆయకట్టు రైతు నుంచి ఎకరాకు రూ.వెయ్యి నుంచి 2వేల చొప్పున వసూళ్లు చేసుకోవటం ద్వారా మరమ్మతులు చేయించుకున్నారు. అయితే కొందరు మాత్రమే డబ్బులివ్వగా మరికొందరు చేతులెత్తేశారు. దీంతో రూ.30 లక్షలు వెచ్చించి ఎత్తిపోతల పథకం–1 కింద మూడు మోటార్లు ఉండగా అందులో రెండు మోటార్లు మాత్రమే రిపేరీ చేయించుకున్నారు. మరో మోటారు రిపేరీకి డబ్బుల్లేక వదిలేశారు.

చందాలు వేసుకొని మోటార్లు రిపేరీ చేయించుకున్నాం

జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం 1, 2 మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు నీళ్లు పెట్టుకోవాలంటే మోటార్లు రిపేరీ చేసుకోవాలి. అందుకు రూ.70లక్షలు ఖర్చు అవుతాయని టెక్నికల్ అధికారులు చెప్పారు. ఆదుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యే ను కలిశాం. రైతుల సమస్యలను ఎమ్మెల్యే, మాండ్రశివానందరెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు చేస్తామని ఇప్పటిదాకా మంజూరు చేయలేదు. సాగుచేసిన పంటలు ఎండిపోతుండటంతో రూ.30లక్షల అప్పుచేసి, చందాలు వేసుకొని మోటార్లకు మరమ్మతులు చేయించుకొని పొలాలకు నీళ్లు పారించుకుంటున్నాం. జూపాడుబంగ్లా–1 పథకం కింద ఇంకా ఓ మోటారు మరమ్మతు చేయించుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి.

–మల్లయ్య, సైపుద్దీన్, సాగునీటి సంఘాల కమిటీ సభ్యులు

అన్న చెప్పాడు డిపాజిట్లు కట్టొద్దు..!



డిపాజిట్లు కడుతున్న టెండరుదారులు

మహానంది: మహానందీశ్వరుడి ఆదాయానికి గండి కొట్టేందుకు ఓ నేత ప్రయత్నించిన చర్యలను టెండుదారులు తిప్పి కొట్టారు. డిపాజిట్లు కట్టేందుకు పలువురు ముందుకు రాగా అన్న చెప్పాడు, డిపాజిట్లు కట్టొద్దంటూ అధికార పార్టీకి చెందిన ఓ చోటా నేత టెండరుదారులకు హుకుం జారీ చేయడం శనివారం వివాదాస్పదమైంది. మహానందిలో శనివారం అగరబత్తీల విక్రయానికి నిర్వహించిన బహిరంగ వేలాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. మహానంది మండలానికి చెందిన పలువురు అధికారపార్టీ నేతలతో పాటు ఇతర మండలాల నుంచి పోటీదారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అయితే ప్రస్తుత టెండరుదారుడికి మద్దతుగా శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన ఓ కీలక నేత అండగా నిలుస్తూ బహిరంగ వేలాలకు డిపాజిట్లు కట్టనివ్వకుండా ఓ చోటా నేతను కార్యాలయం వద్దే ఉంచాడు. అతడు వచ్చిన టెండరుదారులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో అధికారపార్టీ నేతలే అతని చర్యపట్ల అసహనం వ్యక్తం చేశారు. చివరికి కొందరు ముందుకు వచ్చి డిపాజిట్లు కట్టారు. బహిరంగ వేలాల్లో పాల్గొనడంతో మహానందీశ్వరుడికి ఏడాదికి రూ. 9.10లక్షలు ఆదాయం రాగా ప్రతి ఏడాదికి పది శాతం అదనంగా చెల్లించాలని నిబంధనలు ఉండటంతో సుమారు రూ. 55లక్షలకు పైగా ఆదాయం సమకూరింది.

శ్రీగిరి భక్తజన సంద్రం



మల్లన్న దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు.కాగా భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి.

ఆర్యవైశ్యుల సంక్షేమమే ధ్యేయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు

ఆత్మకూరు: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆశీస్సులతో పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి, ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి శాలలో శనివారం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా నరహరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వెంకటశేషఫణి, వెంకటేశ్వర్లు, నాగఫణి, కలికి కృష్ణమూర్తి, రాజా లక్ష్మినారాయణ, ఈపూరి శ్రీనివాసులు, మొగిళ్లపల్లి వెంకటయ్య, సింహాద్రి శ్రీధర్, మారం విష్ణు, కొప్పరపు రవిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరహరి బాలయ్యతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

3న జాబ్‌మేళా

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 3వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో హెటిరో ల్యాబ్, జెప్టో, స్విగ్గీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకోసం 91548 30286, 91822 17075 సంప్రదించాలన్నారు.

పంట పొలాల్లో చిరుతపులి!

మహానంది: మహానంది సమీపంలోని ఉద్యాన పరిశోధనా స్థానం(హార్టీ కల్చర్ రీసర్చ్ స్టేషన్) పంట పొలాల్లో శనివారం చిరుతపులి కనిపించినట్లు వ్యవసాయ కూలీలు తెలిపారు. పొలాల్లోకి వ్యవసాయ పనుల నిమిత్తం అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన కొందరు నిత్యం వెళ్తుంటారు. ఈ క్రమంలో హెచ్ఆర్ఎస్ కార్యాలయం దాటి పాలేరువాగు మీదుగా పొలాలకు వెళ్లారు. నలుగురు కూలీలు చెట్టు కింద కూర్చుని భోజనం చేస్తుండగా సమీపంలో చిరుతపులి కనిపించడంతో భయంతో పరుగులు తీసుకుంటూ కార్యాలయం వద్దకు చేరారు. విషయాన్ని కార్యాలయం వద్ద సిబ్బందికి తెలిపారు. దీంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారని స్థానికులు తెలిపారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వర స్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. శనివారం 34మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను గావించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోష అభిషేకం



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ

మహానంది: మార్గశిర మాసం, బహుళ త్రయోదశి పురస్కరించుకుని మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ నందీశ్వరస్వామికి శనివారం ప్రదోష కాలంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు మూలస్థానం సుబ్బయ్యశర్మ, రఘుశర్మ తదితరులు ప్రత్యేక పూజలు చేపట్టారు. హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు భక్తులు ఆర్జితసేవల్లో పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: గోకులం షెడ్డు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట, కొత్తబానకచెర్ల గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ షెడ్డు నిర్మాణాలు ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు మంజూరు అవుతాని వివరించారు. ఆయన వెంట జేఈ రమేష్ నాయుడు, టీఏ భూషమ్మ తదితరులు ఉన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మిడుతూరు: గోకులం షెడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతాయుతంగా చేపట్టాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. శనివారం మండలపరిధిలోని వీపనగండ్ల గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, ఏపీఓ జయంతి, పంచాయతీ కార్యదర్శి వినోద్, టీఏ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

మహానంది: జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఏపీ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సతీష్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఓబులం ప్రసాద్ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శనివారం వారు మహానందికి వచ్చారు. దర్శనం అనంతరం వారు మాట్లాడుతూ వార్తల సేకరణలో ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అందులో భాగంగా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని పెంచే దిశగా క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. వారి వెంట నాని, జమాల్‌బాషా, బి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చెలిమిల్లలో కబడ్డీ పోటీలు

పాములపాడు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని చెలిమిల్ల గ్రామంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ సంఘీయులు శనివారం తెలిపారు. ఈ నెల 31 నుంచి జనవరి 1 వతేదీ వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు వరుసగా రూ.30,000, రూ.20.000, రూ. 12,000, రూ. 10,000, రూ. 6,000 , రూ.4,000 చొప్పున దాతల సహకారంతో అందజేస్తామన్నారు. క్రీడాకారులకు పాములపాడు శ్రీ సాయి ఫర్టిలైజర్స్, కిరణ్‌కుమార్ గౌడు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు రూ.400 ప్రవేశ రుసుము చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని వివరించారు. పూర్తి వివరాలకు 99087 11518, 63020 21297, 94400 52612 నంబర్లను సంప్రదించాలన్నారు.

రెవెన్యూ సదస్సులో 8 వినతులు



వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 8 వినతుల వచ్చినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు చెందిన భూములలో ఎటువంటి సమస్య ఉన్నా రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. అందులో భాగంగా కొక్కెరంచ గ్రామంలో 5 భూమి కొలతలు, 3 మ్యూటేషన్ సమస్యలు తీర్చాలని రైతులు వినతులు అందజేశారన్నారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 3 వినతులు

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మూడు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ జహంగీర్, వీఆర్వో సుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి

నందికొట్కూరు: పదేళ్లుగా సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు శనివారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలపై వినతిపత్రం వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు 345బై ఏ లో 85 కుటుంబాల దళితులు, బీసీలు గత 20 సంవత్సరాల నుంచి బీడుగా ఉన్న భూములను సాగులోకి తెచ్చారన్నారు. కంపచెట్లు ,రాళ్లు తొలగించి వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా చేసి పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకుడు గోపాలకృష్ణ, గ్రామస్తులు ప్రభాకర్, నాగన్న, పుల్లమ్మ, విజయ్, ప్రశాంతమ్మ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు

రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ

బండి ఆత్మకూరు : యర్రగుంట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ నాగజ్యోతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులను నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. గ్రామంలో నిర్వహించిన సదస్సుకు 14 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ప్రధాన ఆలయం వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి1 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. ఉత్సవాలకు క్షేత్ర పరిధిలో చేపట్టాల్సిన పనులపై ఆయా ప్రదేశాలను శనివారం పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు ఇరువైపులా భక్తులు సేదతీరేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని, షెడ్లలో గ్రీన్ మ్యాట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంగాధర మండపం వద్ద విశాలమైన షెడ్డు, క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తొలగించిన క్యాంటిన్ నెం.1 ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన షెడ్డును నిర్మించాలన్నారు. అనంతరం పలు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలలో జంగిల్ క్లియరెన్స్, గ్రావెల్ చదును, లెవలింగ్, పారిశుద్ధ్య పనులు, బండరాళ్ల పనులు చేపట్టాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలలో మంచినీటి సదుపాయం, తాత్కాలిక విద్యుద్దీకరణ, శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రథమచికిత్సా కేంద్రాలు, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాల్సిన దారులు తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. వీఐపీల పార్కింగ్ కోసం కళాప్రాంగాణం వెనుకభాగంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మురళీబాలకృష్ణ, నరశింహారెడ్డి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ కేంద్రం తనిఖీ

భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను ఈఓ ఎం.శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం అకస్మికంగా తనిఖీ చేశారు. అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించి అన్నప్రసాద వితరణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఈఓ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ అన్నప్రసాద వితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేటట్లుగా తగు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ఆత్మకూరు: జిల్లా వ్యాప్తంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని ఎస్.బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేదలకు ఒక వరం లాంటిదన్నారు. అలాంటి చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో కోతలు విధించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరమ్మ, స్వాములు, పి.పకీర్‌సాహెబ్, ఎం.కర్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పోటాపోటీగా వేలాలు



మహానందిలో వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది దేవస్థానంలో శనివారం నిర్వహించిన బహిరంగ వేలాలు పోటాపోటీగా సాగాయి. అగరబత్తీలు విక్రయించుకునే లైసెన్సు హక్కు కోసం గతేడాది నిర్వహించిన వేలాల్లో ఏడాదికి కేవలం రూ. 3.90లక్షలు మాత్రమే రాగా ప్రస్తుతం రూ. 9.10లక్షలు రావడం విశేషం. దేవస్థానం పాట రూ. 4లక్షల నుంచి మొదలయ్యింది. గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని మరకత లింగేశ్వరస్వామి, నవగ్రహ దేవాలయాల వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు బహిరంగ వేలంలో రూ. 9,10,000తో విక్రయ లైసెన్సు హక్కును పొందారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ నాగమల్లయ్యల ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు, సీల్డు టెండర్లు నిర్వహించారు. నందీశ్వర కంకణములు సరఫరా కోసం ఓం శ్రీసాయి స్టోర్స్ వారు టెండరును దక్కించుకున్నారు. మిగిలిన ల్యామినేషన్ ఫొటోల సరఫరా, రశీదు పుస్తకముల సరఫరా, లడ్డు, పులిహోర ప్రసాదముల తయారీకి నిర్వహించిన వేలాల్లో ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు.

బెల్లం ఊట ధ్వంసం



పట్టుబడిన బెల్లం ఊట వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని నాగలూటిగూడెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటుసారాకు సిద్ధం చేసిన 2,700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ శనివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం దాడులు చేయగా బెల్లంఊట లభ్యమయ్యిందని, వెంటనే దానిని పారబోశామని చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, తరలించినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను సెల్ 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్‌లకు అందించాలన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. నాటుసారా విక్రయాలపై శనివారం సిబ్బందితో కలసి దామగట్ల గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో నాటుసారా అమ్ముతున్న షికారి అర్జున్ వద్ద 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. దాడులలో నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పద్మనాభం, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్ కుమార్, మధుప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పాములపాడు: ప్రభుత్వ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎంపీడీఓపై దాడికి నిరసనగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో విధుల్లో ఉన్న ఎంపీడీఓ జవహర్‌బాబుపై ఎంపీపీ కుమారుడు సుదర్శన్‌రెడ్డి ఆటవికగా దాడికి పాల్పడ్డాడన్నారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్గించి దాడికి పాల్పడిన సుదర్శన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ప్రభుత్వ అధికారులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రతి సోమవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరు కావలసిన దృష్ట్యా శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో అందుబాటులో ఉండనన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన చెంచుగిరిజనులు తమ వినతులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.